రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



## కీసర నూతన సిఐని కలిసిన మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్

**కీసర, ఆగస్టు 2, ప్రభాతవార్త:** కీసరకు నూతనంగా విచ్చేసిన సిఐ ఆంజనేయులును మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్, మేడ్చల్ నియోజకవర్గ బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు ఈగ శ్వేత రాజు ముదిరాజు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాలను అందజేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానన్నారు. ప్రజల సహకారంతో పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లతో ముందుకు సాగుతామని ఆయన పేర్కొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలు మృతి

### బైకు ఢీకొన్న డిసిఎం వాహనం

**పరిగి ఆగస్టు 2 ప్రభాతవార్త :** పరిగి మున్సిపల్ పరిధిలోని సుల్తాన్ పూర్ గేట్ వద్ద శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. నేషనల్ హైవేపై దంపతులు వెళ్తున్న బైకును వెనుక నుండి ఢీకొట్టిన డీసిఎం వాహనం, ప్రమాదం లో మహిళ అక్కడికక్కడే మృతి చెందగా భర్త పరిస్థితి విషమంగా ఉండటంతో పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం వికారాబాద్ ఆస్పత్రికి తరలించాలని పరిగి వైద్యులు తెలిపారు.

పోలీసులు వివరాల ప్రకారం..బొంరాస్ పేట మండలం నాగిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన కోడుగంటి వెంకటయ్య ,లక్ష్మీ దంపతులు పరిగి నుండి నాగిరెడ్డి పల్లి బైకు పై వెళ్తుండగా వెనుక నుండి డిసిఎం వాహనం అతివేగంగా ఢీకొనడం తో లక్ష్మీ అక్కడికక్కడే మృతిచెందింది. .చికిత్స పందుతున్న ఆమె భర్త కూడా రాత్రి 8 గంటలకు మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన డీసిఎం వాహనాన్నిను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు పరిగి ఎస్.హెచ్.ఓ మోహనకృష్ణ తెలిపారు.

## ఆర్థికసాయం చేసిన కలెక్టర్ ప్రతీక్ జైన్



**పరిగి, ఆగస్ట్ 2 ప్రభాతవార్త :** గత ఆరు నెలలుగా ఉండడానికి ఇల్లు లేక ఇబ్బంది పడుతున్న కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు.. శనివారం పట్టణ కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం పనులను పర్యవేక్షణలో భాగంగా ఎంపీడీవో కార్యాలయ సముదాయంలో ఒక నిరుపేద కుటుంబ సభ్యులతో కలిసి ఉన్న వారి యోగక్షేమవాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.. ఈ కుటుంబంలో కుటుంబ యజమాని నారాయణ ఇతని కుమారుడు వెంకటేష్, కోడలు పద్మమ్మ, తల్లిదండ్రులను కోల్పోయి, తాత దగ్గరే ఉంటున్న మనవడు నర్సింలు గత ఆరు నెలలుగా సొంత ఇల్లు లేక ఎక్కడో ఒక దగ్గర షెల్టర్ చూసుకొని జీవనం కొనసాగిస్తున్నారు.. ఈ విషయం తెలుసుకున్న అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.. కుటుంబ సభ్యులకు ఆధార్ కార్డు పొందే విధంగా అధికారులు సహకరించాలని తహసిల్దార్ కు సూచించారు.. అనారోగ్యంతో బాధపడుతున్న నర్సింలు అనే బాలుడికి వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారికి కలెక్టర్ సూచించారు.. బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం 10 వేల రూపాయల నగదును కలెక్టర్ అందజేశారు.. కలెక్టర్ తో పాటు జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఆర్డిఓ వాసు చంద్ర, డిఎంహెచ్ఓ లలితా దేవి, డిడబ్ల్యూఓ కృష్ణవేణి, తాసిల్దార్ వెంకటేశ్వరి, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య లు ఉన్నారు.

## మర్పల్లిని అదర్శ మండలంగా చేస్తా : స్పీకర్ ప్రసాద్‌కుమార్

### అభివృద్ధి సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

### నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి

**మర్పల్లి ఆగస్టు 2 ప్రభాతవార్త :** అభివృద్ధి సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని అమలుచేస్తున్న అన్నిపథకాలునిరంతరం కొనసాగు తాయని అరుహ్హలైన ప్రతి ఒక్కరు ఎప్పుడైనా ఈపథకాలను పొందవచ్చని స్పీకర్‌గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం నాడు మండలకేంద్రంలోని మార్కెట్ యార్డులో స్పీకర్ కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతు పది సంవత్సరాల కాలంలో గత ప్రభుత్వ రేషన్ కార్డులు ఇవ్వలేదని కాంగ్రేస్ ప్రభుతం అరుహ్హలైన వారందరికి రేషన్ కార్డులు ఇస్తామని ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. మండలానాకి 1661 కార్డులు మంజుని జరిగాయని అన్నరు. నియోజకవర్గంలోఇల్లు లేని ప్రతి ఒక్కరికిఇల్లు ఇస్తామన్నారు. గత పాలకులు రోడ్లను గాలికి వదిలేశారని వందకోట్లతో రోడ్లు వేస్తునామని అన్నారు. 9 వేలకోట్ల తొ రైతుబరోన, 50 లక్షల కుటుంబాలకు ఉచిత కరెంటు, ఉచిత బస్సు, పలు సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. తమకు రాజకీయ భవిష్యత్తునిచ్చిన మర్పల్లి మండలాన్ని ఆదర్శ మండలంగా చేస్తానని అన్నారు. మర్పల్లిలో ఇండస్ట్రీస్ పార్క్ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించేందుకు కృషిచేస్తున్నా మన్నారు. అనంతగిరి టూరిస్ట్‌పార్కుగా రోజురోజుకు అభివృద్ధి చెందుతుందని తద్వారా చిరు వ్యాపారులకు ఉపాధి పొందుతున్నారని మరింత అభివృద్ధి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు, రేషన్‌కార్డులుపంఫిణీ చేశారు. ఈ సమావేశంలో పార్టీ అధ్యక్షులు సురేష్‌యాదవ్, బ్లాక్ కాంగ్రేస్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, మార్కెట్ చైర్మెన్ మహేందర్‌రెడ్డి నాయకులు రాములు యాదవ్, రామేశ్వర్, కలీమొదీన్, రఘుపతిరెడ్డి, సంజీవరెడ్డి, చెంద్రన్న, ఫణేష్, సర్సిలు, శేఖర్, తహసిల్దా పురుషోత్తం, ఆర్ఐ మాధవరెడ్డి పలువురు అధికారులు నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతూన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

## మాడ్గులకు మహర్దశ : అల్లుడు రేవంత్ వరాల జల్లు

### 100కోట్ల నిధులు మారనున్న దిశ

### ఇటీవల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

**రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 2,ప్రభాతవార్త:** మాడ్గుల మండలం అల్లుడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శాసనమండలిలో మరో అల్లుడు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ మాట్లాడుతూ మనం ఒకరం రాష్ట్ర ముఖ్యమంత్రి మరో ఒక్కరం శాసన మండలి చైర్మన్ పదవిలలో ఉన్నాం. మన నుండి అత్తగారు మండలమైన మాడ్గుల ప్రజలు ఏదో పెద్దగానే ఆశిస్తున్నారు. వారికిచేస్తేపోలే అనే విధంగా అభివృద్ధి ముందుకు సాగు బతున్నట్లు కనిపిస్తుంది. ప్రధానంగా మారుమూల మండలంలో విద్య వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూ నిధులు మంజూరు చేశారు. మండలంలో రోడ్లు మరియు భవనాల శాఖ రోడ్లు ఉన్నప్పటికీ నేటికీ సింగిల్ రోడ్లు ఉండడంతో పలు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తూ రోడ్లు మరియు భవనాల శాఖ రోడ్లని విస్తరిస్తూ నూతనంగా రోడ్లు పనులు చేపట్టనున్నారు. గత ప్రభుత్వాల ఆయాంలో హైదరాబాదుకు కూతవీడు దూరంలో ఉన్నప్పటికీ అభివృద్ధికి మాత్రం ఆమెడ దూరంలో ఉండేది. కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి కేంద్ర మంత్రిగా ఉన్నప్పటికీ సొంత గ్రామం మాడ్గుల మాత్రం అభివృద్ధికి నోచుకోలేదని విమర్శలు ఉండేవి. గత ఎన్నికలలో టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో మండల కచ్చితంగా అభివృద్ధి చెందుతుందని నమ్మకం ఏర్పడింది. కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి అభివృద్ధి పై ప్రత్యేక చొరవ చూపుతూ మంత్రులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు మారు కలుస్తూ అత్తగారి మండలాన్ని కచ్చితంగా అభివృద్ధి చేయాలని ఒప్పిస్తూ ప్రత్యేక నిధులు రాబడుతున్నారు. గత సంవత్సరం కల్వకుర్తిలో కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ జైపాల్ రెడ్డి సొంత గ్రామానికి ప్రత్యేక నిధులు 10 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అవే కాకుండా ఇటీవల పలు శాఖల నుండి ప్రత్యేక నిధులు మంజూరు చేశారు.

**అభివృద్ధిపై పట్టుబట్టిన బట్టు...**

మాడుగుల మండలంలోని వివిధ గ్రామాలలో పేరుకుపోయిన సమస్యలను ఎప్పటికప్పుడు కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఈ ప్రాంతానికి ఈ పనులు కావాల్సిందే అంటూ పట్టుబట్టి అభివృద్ధికి బాటలు వేస్తున్నారు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బట్టు కిషన్ రెడ్డి. మండలంలోని పలు పంచాయతీరాజ్ రోడ్లు పాఠశాలలో మరింత బలోపేతం కావడానికి కృషి చేస్తున్నారు. గతంలో టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న మండలంలో కార్యకర్తలకు అండగా ఉంటూ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. అభివృద్ధి లక్ష్యంతో రానున్న స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ సత్తామంటున్నారు. మండలంలో అభివృద్ధి పనులు ఇలా45 కోట్లతో మాడ్గుల నుండి కోనాపూర్వరకు ఆర్ అండ్ బి రోడ్డు 30 కోట్లతో మాడ్గుల నుండి దేవరకొండ ఆర్ అండ్ బి రోడ్డు 12.7 కోట్లతో సిహెచ్ సి భవన నిర్మాణం 2 కోట్ల నిధులతో గ్రంథాలయ భవన నిర్మాణం2 కోట్ల నిధులతో కళాశాల అదనపు గదుల నిర్మాణంగతంలో 5 కోట్ల నిధులతో పాఠశాల అదనపుగదులు, మరమ్మత్తులు 5 కోట్ల నిధులతో అండర్ డ్రైనేజీపని నిర్మాణం మొదలగున ప్రతిపాదనలు.

## చేయూతను అందించికపోతే మూల్యం చెల్లించుకోక తప్పదు

**కొడంగల్‌రూరల్, ఆగస్టు2 (ప్రభాతవార్త):** దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం చేయూత పథకాన్ని చెల్లించకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. శనివారం కొడంగల్ పట్టణంలోని కేఏస్‌పీ ఫంక్షన్ హాలులో నిర్వహించిన మహాగర్జనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చేయూత పథకం అమలుపై ఈ నెల 13న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పింఛన్‌దారులతో తలపెట్టిన మహాగర్జన సభ కోసం కొడంగల్‌లో మహాగర్జన సభ నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రేవంత్‌సర్కార్‌పింఛన్‌ల పెంపు చేపట్టాలన్నారు. అధికారంలోకి వచ్చి రెండేళ్ల గడుస్తున్నా నేటి వరకు పింఛన్‌లను పెంచకపోవడం సరైంది కాదన్నారు. ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ల పెంపుదలతో దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఎస్పీ, నాయకులు, అంబేద్కర్ ప్రజా సంఘం, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్టీసి కార్మికుల చేయూత

**శామీర్‌పేట, ఆగస్టు 2, ప్రభాతవార్త :** హకీంపేట్ ఆర్టీసి డిపోలో పనిచేస్తున్న కండక్టర్ పేరాల మహేశ్ గుండెపోటుతో ఇటీవల మృతిచెందటంతో ఆ బాధిత కుటుంబాన్ని ఆదుకోవటానికి డిపోకు చెందిన ఆర్టీసి ఉద్యోగులు, కార్మికులు ఆర్థిక సహాయం 1లక్షా3వేల200రూపాయలు అందజేశారు. శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీలోని హకీంపేట్ ఆర్టీసి డిపో మేనేజర్ భవభూతి చేతుల మీదుగా కండక్టర్ బాధిత కుటుంబానికి ఆర్టీసి డిపోకు చెందిన ఉద్యోగులు, కార్మికులు కలిసి ఆర్థిక సహాయంను అందజేశారు. కండక్టర్‌గా పనిచేసిన మహేశ్ సుమారు 16సంవత్సరాల పాటు విధులు నిర్వహించి గుండెపోటుతో మృతిచెందారని, అతనికి భార్య, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నట్లు తెలిపారు. బాధిత కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటానికి గుర్తించి ఆర్టీసి ఉద్యోగులు కలిసి తమ వంతుగా ఆర్థిక సహాయంను తోచిన విధంగా డబ్బులు జమచేసి భార్య, పిల్లలకు 1,03,200రూపాయలు నగదు అందించి సేవా దృక్పథాన్ని తోటి ఉద్యోగులు చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో హకీంపేట్ ఆర్టీసి డిపో నాయకులు, ఉద్యోగులు సూపర్‌వైజర్ సత్యం, గోపు శ్రీనివాస్‌పటేల్, పవన్‌కుమార్‌యాదవ్, జి.రమేశ్, నాగరాజు, దాసరి నిరంజన్, సుజిత్‌కుమార్, దశరథ, బాలచందర్, సూపర్‌వైజర్ శంకర్, చంటి పుష్పలత, నాగమణి, సింధు, సుజాత, సులోచన, మల్లీశ్వరి, పలువురు తదితరులు పాల్గొన్నారు. అయితే తమ బాధిత కుటుంబానికి తోటి ఆర్టీసి ఉద్యోగులు ఆర్థిక సహాయం అందించినందుకు బాధిత కుటుంబ సభ్యులు వారికి దన్యవాదాలు తెలియజేశారు.

## ప్రజలను మభ్యపెట్టేందుకే పాదయాత్ర స్థానిక ఎన్నికలలో ప్రజలు బుద్ది చెప్తారు

**-మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు మెతుకు ఆనంద్**

**పరిగి, ఆగస్టు2 ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా,** :పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి నివాసంలో శనివారం బిఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ తో కలిసి పత్రికా సమావేశాన్ని నిర్వహించారు. పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి మాట్లాడుతూ .. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ది పొందాలన్న ఆలోచనతోనే కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర చేపట్టారనన్నారు.. బనకచర్ల విషయంలో కాంగ్రెస్, బిజెపి కలిసి తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేసే విధంగా ప్రవర్తిస్తున్నారని , కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు ఏమయ్యాయని, ఏ హామీలు అమలు చేశారో పాదయాత్ర ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు.. దేవుళ్ళ మీద ఒట్టు వేసి మాట మార్చారని, నాయకుల మాటలు చూస్తే హాస్యాస్పదంగా ఉందని మహేష్ రెడ్డి అన్నారు.. మహిళలకు ఉచిత బస్సు, ఉచిత కరెంటు తప్ప ఏది అమలులో ఉందో కాంగ్రెస్ నాయకులు చెప్పాలని, కాంగ్రెస్ పార్టీ దొంగ హామీలతో ప్రజలు ఆలోచనలో పడ్డారని అన్నారు.. 42 శాతం రిజర్వేషన్ మేము స్వాగతిస్తున్నామని, 42 శాతం రిజర్వేషన్ కు బిఆర్ఎస్ పార్టీ మద్దతు ఇస్తుందని మహేశ్ రెడ్డి తెలిపారు.. రూ.2500 మహిళలకు వేస్తారేమో అనిఆశతో పోస్టాఫీసులో మహిళలు రోజూ బారులు తీరుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు బిఆర్ఎస్ పార్టీ పోరాడుతుందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి పేర్కొన్నారు. వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ మాట్లాడుతూ...జనహిత పాదయాత్రను ఎందుకు చేస్తున్నారో కాంగ్రెస్ నాయకులు ప్రజలకు తెలియజేయాలని, పాదయాత్ర అంటే పల్లెల్లో తిరగాలని, హైవేలలో ట్రాఫిక్ జామ్ తో ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా పాదయాత్ర ఉందని మండిపడ్డారు.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తప్పును కపిపుచ్చేందుకే పాదయాత్ర చేస్తున్నారని అన్నారు..పాదయాత్రకు అనుమతులు ఎలా వచ్చాయని సందేహాలం ప్రజల్లో ఉందని, ఆగ మేఘాలపై అనుమతులు ఎలా వచ్చాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే కీలక నాయకుల మధ్య విభేదాలు ఉన్నాయని విభేదాలతో వచ్చిన తప్పులను కప్పిపుచ్చేందుకే ఈ పాదయాత్ర చేస్తున్నారని ఆనంద్ అన్నారు.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుదామనే ప్రజలు ఎదురు చూస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ సత్తా ఏంటో చూస్తారని అన్నారు.. బిసి ల 42 రిజర్వేషన్ కోసం పోరాడుతున్నామంటున్న ప్రభుత్వానికి స్వాగతిస్తామని, మద్దతిస్తామని ఆనంద్ అన్నారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్, ఐటి శాఖ మంత్రి సురేష్ బాబులు పాదయాత్రలో మాట్లాడుతూ, పాదయాత్ర స్థానిక సంస్థల ఎన్నికల కోసం చెప్పుకొస్తున్నారు, కానీ మీనాక్షి తన ప్రసంగంలో స్థానిక ఎన్నికల కోసమేనని చెప్పడం ఏంటని కాంగ్రెస్ నాయకులను నిలదీశారు. దేశాన్ని భారతదేశాన్ని జోడోయాత్రతో రాహుల్ గాంధీ చదివాడని, ముఖ్యమంత్రి ఏమో రాష్ట్రాన్ని చదివాడని, ముఖ్యమంత్రి మారే అవకాశం ఉందని, కాంగ్రెస్ నాయకులే గుసగుసలాడుతున్నారని తెలిపారు.. రాహుల్ గాంధీ మేధావి కాదని మన్మోహన్ సింగ్ మేధావిని టీపీసీసీ మహేష్ గౌడ్ తెలుపడం ప్రజలు ఆలోచించవలసిందేనని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి, మెతుకు ఆనంద్

## పండగలా తల్లిదండ్రుల పాదపూజ



**మాడ్గుల , ఆగస్టు 2, ప్రభాత వార్త :** మాడ్గుల మండలం అవురుపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల పాదపూజ కార్యక్రమం ఆనందత్సోవాల మధ్య కన్నుల వందుగలా సాగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి, సర్దార్ నాయక్ అధ్యక్షత ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రముఖ యోగా గురువు ఆచార్య రమేశ్ గురుజీ, వందేమాతరం ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు బట్టు నర్సిరెడ్డి, ముఖ్య అతిథిగా హాజరై. సరస్వతి దేవి పూజా, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆచార్య రమేష్ గురుజీ వారం రోజులపాటు విద్యార్థులకు వివిధ రకాల యోగా, నృత్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈమేరకు తల్లిదండ్రుల పాదపూజ ఏర్పాటు చేయగా సంప్రదాయ పద్దతిలో చిన్నారుల చేత తల్లిదండ్రుల పాదాలను కడి గించి పూజ నిర్వహించారు. ఈసంధర్భంగా మాధవరెడ్డి కార్యక్రమాన్ని పొగడ్తలతో ముంచెత్తారు. ప్రస్తుత జీవన పోరాటంలో ఉరుకులు పరుగుల జీవితాలతో తల్లిదండ్రులు పిల్లల మధ్య దూరం పెరిగిపోయి బంధుత్వం విలువలు హరించుకుపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పాదపూజ వంటి కార్యక్రమంతో చిన్నారులకు తల్లిదండ్రుల పట్ల గౌరవ మర్యాదలు, బాధ్యతలు సూచిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం. యోగా గురువు ఆచార్య రమేష్ గురుజీ, ప్రధానోపాధ్యాయులు సర్దార్ నాయక్ ఆరోగ్య సూత్రాలతోపాటు, తల్లిదండ్రులను గౌర వించడం, సేవ చేయడం వంటి వాటిని ఉపదేశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శంకర్, పర్వతాలు, రవీందర్, ప్రసాద్, ఉపాధ్యాయ బృందం, లక్ష్మీపతి గౌడ్, సత్యనారాయణ, తిరుపతి గౌడ్, శ్రీను, అనూష, పెద్ద ఎత్తున తల్లిదండ్రులు పాల్గొనగా కార్యక్రమాన్ని తిలకించడానికి ప్రజలు సైతం భారీగా తరలివచ్చారు. ఈమేరకు చిన్నారుల చేత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి .

### స్కూటీ చోరీ కేసులో నిందితుడి కి రిమాండ్..

**చేవెళ్ల, ఆగస్టు 2, ప్రభాతవార్త:** ఇంటిముందు నిలిపి ఉన్న స్కూటీ వాహనాన్ని చోరీ చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్టు శంకర్ పల్లి సిఐ శ్రీనివాస్ గౌడ్ శనివారం తెలిపారు. జూలై 26న ఇంటి ముందు నిలిపి ఉన్న స్కూటీని పటోళ్ల రాజేశ్వర్ రెడ్డి అనే వ్యక్తి చోరీకి పాల్పడ్డాడన్నారు. సీసీ కెమెరాల ఆధారంగా విచారణ చేసి నిందితుని అదుపులోకి తీసుకొని రిమాండ్ తరలించినట్లు వివరించారు.

## సిఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



**కీసర, ఆగస్టు2, ప్రభాతవార్త:** సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి తోటకూర వజ్రేష్ యదవ్ కోరారు. శనివారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని కీసర గ్రామానికి చెందిన గుర్రం లక్ష్మారెడ్డి వైద్య చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి నుండి 1 లక్ష 30 వేల రూపాయల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎవరైనా అనారోగ్యం పాలై హస్పిటల్ బిల్లులను సీఎం సహాయనిధికి ధరఖాస్తు చేసుకుంటే వారికి సీఎం రిలీఫ్ ఫండ్‌ను మంజూరు చేయించడం జరుగుతుందన్నారుమండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుకోలక్రిష్ణయాదవ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి, నాగారం మున్సిపల్‌మాజీవైస్‌చైర్మన్‌బండారి మల్లేష్ యాదవ్, కీసరగుట్ట ట్రస్టుబోర్డు సభ్యులుపోచబోయినరాజుయాదవ్, ప్రవీణ్ ముదిరాజు, నాయకులు మచ్చా నిజంగయ్యయాదవ్, మచ్చాశ్రీశైలంయాదవ్, ముద్దంమల్లేష్‌యాదవ్, దయానంద్‌గౌడ్, కుమ్మరి క్రిష్ణ, శ్రీశైలం యాదవ్, మెట్టు అంజయ్య యాదవ్ పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



**దౌల్తాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో ప్రమాదవశాత్తుగాఓఇల్లు దగ్ధమైంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన ఎర్రవల్లి అనంతప్పకు చెందిన బండల ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైందని, తమ ఇంట్లో దేవుడి రూమ్‌లో ఉన్న ద్వీపం అంటుకొని ఇంట్లో ఉన్న సామగ్రి, విలువైన పత్రాలు, సుమారు 2 అక్షల మేర నగదు కాలి బూడిద అయ్యిందని బాధితుడు తెలిపారు. అనంతరం విషయం తెలుసుకున్న పోలీసులు, ఆర్ఐ సునీల్ సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## తిరుపతి తరహాలో కొడంగల్ శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయం

### రాష్ట్రషదేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్



**కొడంగల్, అగష్టు 2ప్రభాతవార్త** తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం ప్రణాళికబద్ధంగా వికారాబాద్ జిల్లాకొడంగల్ పట్టణంలోని శ్రీమహా లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్‌తెలిపారు.

శనివారం కొడంగల్‌పట్టణ కంద్రంలోని శ్రీమహా లక్ష్మీ వేంకటేశ్వర దేవాలయ అభి వృద్ధిలో భాగంగా దేవాదాయ శాఖ కమీషనర్ వెంకట్‌రావు, జిల్లా కలెక్టం ప్రతీక్‌జైన్, ధార్మిక సలహ దారులు గోవింద్ హరిలతో కలిసి దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్‌కొడంగల్‌లో పర్యటించారు.

ఈ సందర్బంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ కొడంగల్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని ఆగమశాస్త్రం ప్రకారం ప్రణాళిక బద్ధంగా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నా మన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు భక్తుల సౌకర్యార్థం పూర్తిస్థాయిలో తిరుపతి తరహాలో ఆగమ శాస్త్రం ప్రకారం దేవాలయ నిర్మాణం చేపట్టనున్నట్లు అమె తెలిపారు. దేవాలయ ప్రాంగణంలో కళ్యాణ మండపం, కోనేరు అభివృద్ధి, ప్రసాదం కౌంటర్ల ఏర్పాట్లు తదితర పనులను చేపట్టి త్వరలో పనులు పూర్తి చేయనున్నట్లు అమె తెలిపారు.

ఈ సందర్బంగా ప్రిన్సిపల్ సెక్రెటరీ అధికారులతో కలిసి దేవాలయ పునరాభివృద్ధిలో భాగంగా ఇండ్లు కోల్పోతున్న వరికి ఇండ్ల స్థలాలను కేటాయించిన లేఅవుట్ చేసిన ప్రాంతం, గోశాల, కోనేరు ను సందర్శించారు.

పర్యటనలో భాగంగా శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయ సందర్శించుకున్న క్రమంలో వేద పండితులు, ఆలయ అర్చకులు ప్రిన్సిపల్ సెక్రటరీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ముందుగా దేవాలయ పునరుద్దరణ పనుల్లో భాగంగా దేవాలయ నిర్మాణంతో పాటు వివిధ సౌకర్యాల ఏర్పాట్లకు సంభందించి వాస్తు శిల్పి సత్యనారాయణమూర్తి పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, తహశీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్, ఆలయ ధర్మకర్తలు, ఆలయ ఈఓ రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## దేవాలయాలు అభివృద్ధి చేస్తా

### రూ. 50 లక్షలతో హిందు ఉత్సవ కేంద్ర భవన నిర్మాణానికి శంకుస్థాపన

**..ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి**

**పెద్దేముల్, ఆగస్టు2, ప్రభాతవార్త:** నేను మాటలు మాట్లాడను కాని పక్కా పని చేయిస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారంతాండూరు ఖాంజాపూర్ గుట్టలో రూ. 50 లక్షలతో నూతనంగా నిర్మించే హిందు ఉత్సవ కేంద్ర సమితి భవన నిర్మాణానికిఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్బంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ తాండూరు నియోజకవర్గంలోని అన్ని దేవాలయాలను అభివృద్ధి చేస్తానని అన్నారు. తాండూరులో ఉన్న ఆలయాల అభివృద్ధికి నూతన కమీటిలు వేసామని అన్నారు. భద్రప్ప గుడికి చాల మంది టెంకాయలు కొట్టారు తప్ప దాసోహం కట్టలేదని, తాము దాసోహం కట్టామని అన్నారు. జుంటుపల్లి సీతారామ చంద్రస్వామి ఆలయానికి, ఎకాంబర దేవాలయానికి రోడ్డు వేస్తున్నామని అన్నారు. గుడులతో పాటు బడులనుబాగు చేస్తున్నామని, తనవంతు అన్ని సహయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఏటిసి సెంటర్ ఏర్పాటు, ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంఖుస్థాన చేసినట్లు గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో ఎవరి పార్టీ వారిది, అభివృద్దిలో అందరం ఏకమై కలిసి కట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఎన్నో ఏళ్ల కళ సాకారం చేసినఎమ్మెల్యేకు హిందు ఉత్సవ కేంద్ర సమితి సభ్యులు దన్యావాదాలు తెలిపారు.

# సీఈఐజీలో గంగరగోళం!

**-కీలక పోస్టులు ఖాళీగా ఉండటంతో ఫైళ్లన్నీ పెండింగ్**
**-మూడునెలలుగా అప్రూవల్స్‌లేక ఆగిపోతున్న ప్రాజెక్టులు -వందరోజుల్లోనే 600లకుపైగా పెండింగ్ ఫైళ్లు**

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** విద్యుత్ తనిఖీ విభాగాన్ని ప్రభుత్వం గాలికి వదిలేసింది. విద్యుత్ ప్రమాదాలు నియంత్రించడంలో కీలక భూమిక పోషించే చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్స్పెక్టరేట్ ఆఫ్ గవర్నమెంట్ (సీఈఐజీ) విభాగాన్ని పాలకులు పట్టించుకోవడం లేదు. దీంతో విద్యుత్ తనిఖీ విభాగం సేవలు దాదాపుగా వంద రోజుల నుంచి నిలిచిపోయాయి. ఒక్క ఫైల్ కూడా ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంది. ఈవిభాగంలో కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. దీంతో సీఈఐజీ లేక ఉన్న అర కొర సిబ్బంది కార్యాలయానికి రావడం వెళ్లడం తప్ప ఏమి చేయలేని పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికే పరిశ్రమలు, హైరేజ్ బిల్డింగ్‌లకు సంబంధించిన ఫైళ్లు 600లకు పైగా పెండింగ్లో ఉన్నట్లు సమాచారం. కీలకమైన సీఈఐజీ శాఖ విషయంలో పాలకులు పట్టించుకోక పోవడంతో ఇక్కడ విద్యుత్ వినియోగదారులు తమ ముప్పు తిప్పలు పడుతున్నారు.

పరిశ్రమలు, భారీ భవనాలకు అనుమతులు ఇచ్చే ఈ విభాగానికి ఇంధన వనరుల శాఖ కనీసం ఇంచార్జి అధికారిని కూడా నియమించకపోవడంతో విద్యుత్ భద్రతా తనిఖీలు పూర్తిగా స్తంభించాయి. రాష్ట్రంలో విద్యుత్ ప్రమాదాలు పెరుగుతున్నా, వాటిని నియంత్రించే యంత్రాంగం లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**పోస్టులన్నీ ఖాళీ..**

ఒక సీఈఐజీ తో పాటు, రెండు డిప్యూటీ సీఈఐజీ, ఒక ఎలక్ట్రికల్ ఇన్స్పెక్టర్తో పాటు 20 ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దశాబ్ద కాలానికి పైగా సీఈఐజీ విభాగంలో ఏలాంటి నియామకాలు లేవు. ఇక ఖాళీలు ఉన్న పోస్టులకు అర్హులైన వారికి కనీస




పదోన్నతులు కల్పించడంలేదు. దీంతో సీఈఐజీ, హైదరాబాద్ డిప్యూటీ సీఈఐజీ, రూరల్ డిప్యూటీ సీఈఐజీ, నిజామాబాద్ ఎలక్ట్రికల్ ఇన్ స్పెక్టర్ వంటి కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 30 వరకు ఈ నాలుగు పోస్టుల బాధ్యతలను ఒకే అధికారి నిర్వహించారు. మూడు నెలల క్రితం వరకు ఇంచార్జీ సీఈఐజీగా ఉన్న రామాంజనేయులు గత ఏప్రిల్ 30 వ తేదీన ఉద్యోగ విరమణ చేశారు. ఆయన ఉద్యోగ విరమణ చేసే నాటికి ఇంచార్జీ సీఈఐజీగా, హైదరాబాద్ డిప్యూటీ సీఈఐజీగా, రూరల్ సీఈఐజీగా, నిజామాబాద్ ఎలక్ట్రికల్ ఇన్స్పెక్టర్గా నాలుగు బాధ్యతలను ఒక్కడే నిర్వ వాంచారు. అంటే తెలంగాణాలోని పది ఉమ్మడి జిల్లాల న్నింటి బాధ్యతలను రామాంజ నేయులు ఒక్కరే నిర్వహించారు.

**తనిఖీలు ముచ్చటేలేదు..**

రాష్ట్రవ్యాప్తంగా 11 కేవీకి చెందిన 16,140 విద్యుత్ కనెక్షన్లు, 33 కె వీకి చెందిన 883 విద్యుత్ కనెక్షన్లు, 132 కేవీకి చెందిన 107 విద్యుత్ కనెక్షన్లు సీఈఐజీ పరిధిలో ఉన్నాయి. వీటిని ఏడాదికో సారి తప్పని సరిగా తనిఖీలు చేయాలి. తక్కువ సిబ్బంది ఉండడంతో ఒక్కో అధికారి రోజుకు సగటున 50 కనెక్షన్లను తనిఖీ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కానీ గత మూడు నెలలుగా తనిఖీల ముచ్చటనే లేదు. ఈ నేపథ్యంలో ఖాళీల ను భర్తీ చేయడంపై ఇంధన శాఖ దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మూడు నెలలుగా సీఈఐజీ ధృవీకరణ పత్రం లేక పోవడంతో విద్యుత్ అధికారులు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను చార్జ్ చేయక పోవడంతో విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. కావున ఇంధన వనరుల శాఖ ఉన్నతాధికారులు వెంటనే సీఈఐజీగా ఎవరికైనా ఇంచార్జీ బాధ్యతలను అప్పగించి సమస్యలకు పరిష్కారం చూపాలని పలువురు కాంట్రాక్టర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

## బిసిల 42 శాతం రిజర్వేషన్లు 9వ షెడ్యూల్డ్‌లో చేర్చాలి : ఎర్ర సత్యనారాయణ

**సైఫాబాద్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** బిసిల 42 శాతం రిజర్వేషన్‌ల అంశా న్ని బిజెపి ఒక రాజకీయ అంశంగా చూడకుండా తమిళనాడు తరహాలో పార్లమెంట్‌లో 9వ షెడ్యూల్డ్‌లో చేర్చి మార్గం సుగమం చేయాలని తెలంగా ణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ ర్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిజెపి శాశ్వతంగా కనుమరుగవుతుంద ని హెచ్చరించారు. అలాగే ఈ అంశాన్ని బిజెపితోపాటు అన్ని రాజకీయ పార్టీలు కూడా ఒక రాష్ట్రం అంశంగా చూడకుండా జాతీయ సమస్యగా గుర్తించి మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిల రిజర్వేషన్‌లకు మద్దతుగా ఈ నెల 5, 6 తేదీలలో రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగే ధర్నాలో తమ సంఘం కూడా పాల్గొంటుందని చెప్పారు. బిసిల రిజర్వేషన్‌ల అమలుకు అవసరమైతే సిఎం రేవంత్‌రెడ్డి, ఎపి సిఎం, బిహార్ సిఎంల సహకారం తీసుకోవాలని ఆయన కోరారు. ఈ నెల 10వ తేదీన బిసిల విస్తృత స్థాయి సమావేశం హైదరాబాద్ నగరంలో నిర్వహిస్తున్నామని, ఈ సమావేశంలో అన్ని రకాల రిజర్వుడ్ కేటగిరి నాయకులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ఇందులో భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామన్నారు. ఈ సమావేశంలో బిసి నేతలు పి.సుధాకర్‌ముదిరాజ్, కోలా జనార్ధన్, జక్కుల వంశీకృష్ణ, శ్రీనివాస్‌యాదవ్, పాండుయాదవ్, నందగోపాల్, నరహరి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమాలపై చర్యలు చేపట్టండి : ఆకుల సతీష్

**దుండిగల్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** విల్లాలు నిర్మాణంలో రియల్‌సంస్థ చేపడుతున్న అక్రమాలపై చర్యలు చేపట్టాలని కోరుతూ ఆకుల సతీష్ శనివారం తహసీల్దార్, పురపాలిక అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాగిల్లాపూర్ పరిధి లో ప్రణీత్ ప్రణవ్ గ్రూవ్‌పార్కు పేరుతో రియలల్ సంస్థ విల్లాల నిర్మాణం చేపట్టింది. విల్లాలో మధ్యలో ఉన్న చెరువు బఫర్ జోన్ ఆక్రమణకు గురైంది. ఉస్మాన్‌కుంట చెరువును ప్రణీత్‌ప్రణవ్‌గ్రూవ్‌పార్కు చెరువుగా మార్చడంతో పాటు ఎఫ్‌టిఎల్, బఫర్‌లను ఆక్రమించి చెరువు స్వరూపాన్నే మార్చారన్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అప్రోచ్ రోడ్డు నిర్మించి నాలాను పూడ్చివేశారని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమాలపై వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎంబరి ఆంజనేయులు, శ్రీనివాస్,అరుణ్‌రావు, చందు, ముఖేష్ పాల్గొన్నారు.

# అర్హులందరికీ రేషన్ కార్డులు

**-మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో 55వేల కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం అంబర్‌పేట మహారాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, మాజీ ఎంపి వి.హనుమంతరావు, అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ రోహిణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ శ్రావణ మాసం వచ్చే వరకు ఆషాఢ మాసంలో బోనాల పండుగ జరిగింది ఇప్పుడు శ్రావణ మాసంలో హైదరాబాద్ లో రేషన్ కార్డుల పండగ జరుగుతుంది రేషన్ కార్డులు పంపిణీ నిరంతర ప్రక్రియ.. ఎవరు ఎప్పుడైనా పేర్లు నమోదు చేసుకోవచ్చు గత 10 సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు కూడా రాలేదు.. ఒక్క పేరు కూడా నమోదు కాలేదు. రాజకీయాలకు అతీతంగా రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ జరుగుతుంది సివిల్ సప్లైస్, హైదరాబాద్ , జీహెచ్ ఎంసీ సమన్వయం చేసుకొని రేషన్ కార్డుల వెరిఫికేషన్ నడుస్తుంది ఇంకా లక్షా రేషన్ కార్డుల వెరిఫికేషన్ నడుస్తుందన్నారు. 'అంబర్‌పేట నియోజకవర్గంలో 3358 కొత్త రేషన్ కార్డులు ఇచ్చాం,20,117 మంది కొత్తగా రేషన్ కార్డులో పేర్లు నమోదు చేసుకున్నారు.నియోజకవర్గంలో 35,980 నుండి 39,338కి రేషన్ కార్డులు పెరిగాయి. లబ్ధిదారుల సంఖ్య 1,23,468 నుండి 1,43,585 పెరిగింది. ఇంకా కొత్తగా 5292 రేషన్ కార్డులు వెరిఫికేషన్ జరగాల్సి ఉంది.ఇంకా 1326 సభ్యుల సంఖ్యను విచార జరుగుతుంది' అన్నారు. '200 యూనిట్ల ఉచిత విద్యుత్..500 కి గ్యాస్ ఇస్తున్నాం ఆర్టీసీ లో 200 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారు. 6800 కోట్ల రూపాయలు విలువైన ఉచిత ప్రయాణం చేశారు.. 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతు భరోసా ఇచ్చి రైతు పండగ చేశాం. రైతు రుణమాఫీ చేశాం ఈ సంవత్సరం నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం మన పిల్లల చదువుకునే హాస్టల్‌లలో మెస్ చార్జీలు పెంచాం.60 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. ప్రభుత్వాన్ని నిండు మనసు తో ఆశీర్వదించండి ఇంకా రేషన్ కార్డులు రానివారు అప్లికేషన్ పెట్టుకోండి. అర్హత ఉన్నవారందరికీ రేషన్ కార్డులు వస్తాయని' అన్నారు.ఈ కార్యక్రమంలో అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, ఏఎస్‌వో దీప్తి పాల్గొన్నారు.



అంబర్‌పేటలో రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎంపి వి.హనుమంతరావు, కలెక్టర్ దాసరి హరిచందన, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు

**ముషీరాబాద్ నియోజకవర్గంలో**

ముషీరాబాద్‌లోని కౌశిక్ ఫంక్షన్ హాల్ నందు శనివారం ముషీరాబాద్ నియోజకవర్గంలో అర్హులైన వారికి రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన, జీహెచ్‌ఎంసీ కమీషనర్ ఆర్వీ కర్ణణ్‌లతో కలసి మంత్రి లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందచేశారు.

**కంటోన్మెంట్ నియోజకవర్గంలో**

బాలంరాయిలోని లీ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో కంటోన్మెంట్ నియోజకవర్గం ప్రజలకు మంజూరైనా 1150 నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ముఖ్య అతిధిగా హాజరై ఎమ్మెల్యే శ్రీగణేష్‌తో కలిసి రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కంటోన్మెంట్‌లో 1450 కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయడంతో పాటు సన్న బియ్యం అందజేస్తున్న ఘనత సిఎం రేవంత్‌రెడ్డికే దక్కిందనా న్నరు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్.డి.ఓ.సాయికిరణ్, సివిల్ సప్లయ్ అధికారులు చాముండేశ్వరి,క్రిష్ణ వేణి, తహశీల్దార్లు బీమయ్య గౌడ్, బిక్షపతి, పాండు నాయక్, బోర్డు మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్,మోండా కార్పోరేటర్ కొంతం దీపిక, బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్ ఆనంద్ బాబు గౌడ్‌లతో పాటు ఆలయాల చైర్మన్లు అల్లాడి గౌరి శంకర్, అరవింద్ యాదవ్, రేపాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# చారిత్రక అందాలు చూడతరమా..

**-గోల్కొండ కోట నుంచి 7 టూంబ్స్ వరకు రోప్ వే నిర్మాణానికి ప్రణాళికలు.**
**-సాధ్యా సాధ్యాలు పరిశీలిస్తున్న హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ**
**-రోప్ వేతో పర్యాటకుల తాకిడి పెరిగే అవకాశం.**


గోల్కొండ కోట


రోప్ వే

**మెహిదీపట్నం, ఆగస్టు 2, ప్రభాతవార్త :** చారిత్రాత్మక గోల్కొండ కోట అందాలు ఇక పర్యాటకులు రోప్‌వే ద్వారా చూసే అవకాశం దక్కనుంది. గోల్కొండ కోట నుంచి 7టూంబ్స్ వరకు రోప్ వే నిర్మాణమార్గానికి హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండిఏ) ప్రణాళికలు సిద్ధం చేస్తుండడం పర్యాటకుల్లో నూతన ఉత్తేజాన్ని కలిగిస్తుంది. హైదరాబాద్ నగరంలో చారిత్రాత్మకమైన ప్రదేశాలలో గోల్కొండ కోట ఒకటి కావడంతో ఇప్పటికే గోల్కొండ కోటను చూసేందుకు నిత్యం వేలాది మంది పర్యాటకులు సందర్శిస్తుంటారు. వీరికి తోడు విదేశీ పర్యాటకులను సైతం ఆకర్షిస్తుండడంతో గోల్కొండ కోట నిత్యం పర్యాటకులతో సందడిగా కనిపిస్తుంది. గోల్కొండ కోట పక్కనే ఉన్నటువంటి కుతుబ్ షాహి సమాధులను సైతం పర్యాటకులు సందర్శిస్తూ చరిత్ర విషయాలను తెలుసుకుంటుంటారు. దీంతో ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. కోట నుంచి టూంబ్స్ కు వెళ్లే రహదారులు ఇరుకుగాను ఉండడంతో పర్యాటకులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సుమారు కిలోమీటర్ దూరంలో టూంబ్స్ సమాధులు ఉండడంతో పర్యాటకులు కాలినడకన, ప్రైవేటు వాహనాలు, ఆటోలను ఆశ్రయిస్తున్నారు. రోప్ వే మార్గం ఏర్పాటు చేస్తే పర్యాటకులకు ఇబ్బందులు తొలగిపోయే అవకాశం ఉండడంతో రోప్ వే నిర్మాణం కోసం సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. గోల్కొండ కోట నుంచి టూంబ్స్‌కు వెళ్లే రహదారి చుట్టుపక్కల బహుళ అంతస్తులు, రక్షణ శాఖకు సంబంధించిన భూములు ఉండడంతో సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోవాలనే అంశంపై అధికారులు దృష్టి సారించారు. ఇక రోప్ వే మార్గం ఏర్పాటు చేస్తే గోల్కొండ కోటకు పర్యాటకుల తాకిడి మరింత పెరగనుంది.

# హైడ్రా అంటే భయం కాదు..నగర ప్రజలకు అభయం

**-కబ్జాలు చేసినవాళ్లే హైడ్రాపై దుష్ప్రచారం**
**- కమిషనర్ ఎ.వి.రంగనాథ్**

**హైదరాబాద్, ఆగస్టు 2,ప్రభాతవార్త:** హైడ్రా అంటే భయం కాదని.. నగర ప్రజలందరికీ ఓఅభయం అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. చెరువులు, నాలాలు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కబ్జా చేసిన చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని నగర ప్రజలకు సూచించారు. 5 ఎకరాల భూమిని కబ్జా చేసి అందులో పని వాళ్లకోసం ఒక షెడ్డు వేసి .. దానిని తొలగించినప్పుడు వారిని ముందుంచి గేమ్ ఆడి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న విషయాన్ని అందరూ గ్రహించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా శనివారం టోలీచౌక్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన మొట్టమొదటి కార్యక్రమంలో వివిధ బస్తీల నుంచి వచ్చిన ప్రజలను ఉద్దేశించి కమిషనర్ ప్రసంగించారు. హైడ్రా ఎప్పుడూ పేదలు, సామాన్యుల పక్షమే అని తాము చేస్తున్న కార్యక్రమాలను పరిశీలిస్తే అర్థమౌతుందన్నారు. హైడ్రాను బూచిగా చూపించి వారి కబ్జాలను, ఆక్రమణలను కాపాడుకోడానికి బడాబాబులు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. పేదలు ఎక్కడైనా ఇల్లు నిర్మించుకుని ఉంటే వాటిని తొలగించమని.. ఒక వేళ తప్పని సరైతే వారికి ప్రత్యామ్నాయంగా ఎక్కడైనా నివాసాన్ని చూపించి మాత్రమే హైడ్రా ముందుకెళ్తుతందని స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానం కూడా ఇదేనని తెలిపారు. మూసీ నది సుందరీకరణతో హైడ్రాకు సంబంధం లేదన్నారు. నదీప్రవాహానికి అడ్డంగా మారిన కబ్జాలను తొలగించాం. ఇలా 10 ఎకరాల మేర కబ్జా చేసి నెలకు రూ. కోటి ఆదాయం పొందుతున్నవారి భరతం పట్టామన్నారు. నాలాలు, చెరువుల పరిరక్షణ అందరి బాధ్యత....నాలాలను, చెరువులను కాపాడడం అందరి బాధ్యతగా భావించాలని రంగనాథ్ సూచించారు. షేక్‌పేట, టోలీచౌక్ ప్రాంతంలోని విరాట్‌నగర్, బసవతారకం నగర్ ప్రాంతంలో నాలాల్లో పరుపులు, దిండులు, ప్లాస్టిక్ వ్యర్థాలు ఏళ్లుగా పేరుకుపోవడంతో గతంలో వరద ముంచెత్తేది. పది రోజులుగా నాలాల పూడికను తొలగించడంతో ఇప్పుడు వరద సాఫీగా సాగుతోందన్నారు. ఈకార్యక్రమంలో భాగస్వామ్యులైన స్థానిక కార్పొరేటర్లు, బస్తీల నాయకులతో పాటు.. ప్రజలను కమిషనర్ అభినందించారు. ఆరోగ్యమైన వాతావరణంలో బతకడం ఓహక్కు అని.. దీనిని అందరూ కలిసి సాధించుకోవాలన్నారు. చారిత్రక బుల్కాపూర్ నాలాను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో అందరూ సహకరించాలిలన్నారు. సీసీటీవీలు కూడా నాలా పొడుగునా పెడతామని.. చెత్త వేసిన వారిని స్థానికులే ఆపాలన్నారు.

నగరంలోని 750 బస్తీలకు వరద ముప్పు ఉందనీ.. అన్ని బస్తీల్లో నాలాలను పరిశుభ్రం చేసి ముంపు ముప్పును తప్పిస్తామని హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రంగనాథ్

## ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బంగారు పతకాలు


గవర్నర్ జిష్ణు దేవ్ చేతలు మీదగా ఆరు బంగారు పతకాలు, అందుకుంటున్న విద్యార్థిని భార్గవి

**అత్తాపూర్ జులై2,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ స్నాతకోత్సవానికి విచ్చేసిన ముఖ్యఅథులు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ,డిపార్ట్మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ (డేర్) కార్యదర్శి డాక్టర్ మంగీలాల్ జాట్‌లు ఉపకులపతి అల్దాస్ జానయ్యతో కలిసి ప్రతిభ కనపరిచిన 20 మంది విద్యార్థులకు 30 బంగారు పతకాలు అందజేశారు. కంది అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన భార్గవి బి.టెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)లో అత్యధిక ఓజిపిఏ సాధించినందుకు 6 బంగారు పతకాలు, వరంగల్ వ్యవసాయ కళాశాలకు చెందిన అర్షియా తబస్యుమ్ బిఎస్‌సీ (ఆనర్స్), అగ్రికల్చర్‌లో అత్యధిక ఓజిపిఏ సాధించినందుకు నాలుగు బంగారు పతకాలను అందుకున్నారు.ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

## సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ త్వరగా అందుబాటులోకి తీసుకువస్తాం: పీఏసీ చైర్మన్ గాంధీ

**శేరిలింగంపల్లి, అగష్టు2 ప్రభాతవార్త** శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని సివరేజ్ ట్రీట్‌మెంట్‌ప్లాంట్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోనికి తీసుకువస్తామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ అన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్,శాంతినగర్‌కాలనీ మద్యలోగల ఎస్‌టీపీ లైన్‌లో తలెత్తిన సమస్య పరిష్కారం కోసం చేపడుతున్న మరామ్మత్తు పునరుద్దరణ పనులను జలమండలి అధికారులతో కలిసి పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. దీప్తిశ్రీనగర్,శాంతినగర్ మద్యగల ఎస్‌టీపీ లైన్‌లో తలెత్తిన సమస్యను సూపర్ సక్కర్ యంత్రం ద్వారా పనులు చేపడుతున్నామన్నారు. ఎస్‌టీపీ లైన్‌లో పేరుకుపోయిన చెత్తా,చెదారాన్ని తొలగించి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలన్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోనికి తీసుకువస్తామన్నారు.ఎస్‌టీపీలైన్ సమస్యకు శాశ్వత పరిష్కా్రం త్వరలోనే చూపుతామని, ఔట్‌లెట్ సరిగా లేకపోవడంతో కుంచించుకుపోవడంతో కాలనీలో మురుగు సమస్య తీవ్రతరమైనదన్నారు. ఎస్‌టీపీ ఔట్‌లెట్‌ను సరిచేసి డ్రైనేజీ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, కాలనీ వాసులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. డ్రైనేజీ మ్యాన్ హోల్‌లను మరామ్మత్తులను చేపట్టి ఇబ్బంది లేకుండా చూడాలని, మరలా సమస్య పునరావృత్తం కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని,సూపర్ సక్కర్ మిషన్ ద్వారా ప్రతి మ్యాన్‌హోల్‌లో చెత్తా,చెదారం లేకుండా పూడిక తీసి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలని, అవసరమున్న చోట మ్యాన్‌హోల్స్‌ను మరమ్మత్తులు చేపట్టి అందుబాటులోనికి తీసుకురావాలని జలమండలి అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు మేనేజర్ శిరీష,వర్క్ ఇన్‌స్పెక్టర్ కిష్టప్ప,స్థానిక నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.


శాంతినగర్‌లోని ఎస్‌టీపీ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ,జలమండలి అధికారులు

## ఆవులు ఎత్తుకెళ్లిన వ్యక్తులను పట్టుకునేందుకు గాలింపు : డిసిపి రష్మిపెరుమాల్

**కంటోన్మెంట్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెల 30న ఆవులను ఎత్తుకెళ్లిన వ్యక్తులను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టామని ఉత్తర మండలం డిసిపి సాదన రష్మిపెరుమాల్ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇంటి ముందు ఉన్న ఆవును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తికెళ్ళారని ఫిర్యాదు వచ్చిందని ఆమె తెలిపారు. ఆవును ఎత్తికెళ్లిన కొంత మందిని గుర్తించినట్లు తెలిపారు. త్వరలో నిందితులను పట్టుకుంటామన్నారు. ఈ అంశంపై దుస్ప్రచారం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. దుస్ప్రచారం చేయడంతో ప్రజలను తప్పుదోవ పట్టించినట్లు మతద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ఉంటాయన్నారు. ఆవును ఎత్తుకెళ్లిన నిందితులను పట్టుకొని వారికి శిక్షపడే విధంగా చర్యలు తీసుకుంటామనా న్నరు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ డిసిపి సుదింద్ర, మార్కెట్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ నమ్రత విచారణలో వెలుగులోకి వస్తున్న నిజాలు

**కంటోన్మెంట్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** సంతాన సాఫల్య కేంద్రం పేరుతో పలు అక్రమాలకు పాల్పడిన సృష్టి టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రతను ఉత్తర మండలం పోలీస్‌లు జరుపుతున్న విషయాలల్లో నమ్మలేని నిజాలు బయట పడుతున్నాయి. సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ క్యాంప్‌లు, పేదింటి ఆడ బిడ్డలకు ఉచితంగా ఫర్టీలిటీ సేవలు అందిస్తామని మాయ మాటలతో అమాయకులను మోసగిస్తున్నట్లు తెలిసింది. వేరే వల్లకు పుట్టిన బిడ్డను తీసుకు వచ్చి మీకు పుట్టిన బిడ్డనే అని నమ్మించిన నమ్రత,ప్రసవం తరువాత నవజాత శిశువును తీసుకొని తల్లికి డబ్బులు ఇస్తున్నట్లు వెలుగులోకి వచ్చాయి. అక్రమంగా సంపాదించిన డబ్బులతో హైదరాబాద్, వైజాగ్, విజయవాడ, గుంటూర్‌లలో ఫామ్‌హౌజ్‌లు, భవన సముదాయాలు కొనుగోలు చేసినట్లు వెల్లడైయ్యాయి.

# లగ్జరీ కార్లలో దిగిపోతారు..

**-ఆవులకు మత్తుమందు ఇచ్చి ఎత్తుకెళ్తుతున్నారు..!**
**-సిసి కెమెరాల్లో దృశ్యాలను చూసి షాక్‌తిన్న పోలీసులు**

**హైదరాబాద్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** ఖరీదైన కార్లలో వస్తారు.అక్కడే గంటల తరబడి తిష్ఠ వేస్తారు. కబుర్లు చెప్పుకొని వెళ్లిపోతున్నారేమో? లేదా మందు ఏమైనా తాగుతున్నారా? ఓ దమ్ము లాగించి వెళ్తున్నారేమో..అనుకుంటే పొరపాటే. ఎందుకంటే ఇంతకీ వాళ్లు ఏం చేస్తున్నారంటూ ఫోకస్ పెట్టిన పోలీసులు.. సికింద్రాబాద్లో సీసీ కెమెరాల్లో రికార్డు అయిన ఆ దృశ్యాలను చూసి పోలీసులు షాక్ తిన్నారు. ఖరీదైన కార్లలో కొందరు యువకుల వచ్చారు.. గంట పాటు అక్కడే ఉండి వెళ్లిపోయారు. వారేవరో అర్థం కాక సీసీ కెమెరాలు గమనిస్తే అసలు విషయం తెలిసి అంతా షాక్ అయ్యారు.. సికింద్రాబాద్ బండిమేట్ ప్రాంతంలో కొందరు యువకులు రాత్రి సమయల్లో ఖరీదైన కారులో వచ్చారు. కొంత సమయనికి అక్కడ కొన్ని ఆవులు స్పృహ లేకుండా పడిపోయి ఉండగా.. మరి కొన్ని ఆవులు కనిపించలేదు.. దీంతో, వెంటనే సీసీ టీవీ ఫుటేజ్‌ను స్థానికులు పరిశీలించగా.. కొందరు యువకులు ఆ ఖరీదైన కారులో ఆవులను బలవంతంగా తీసుకెళ్లినట్టు కనిపించింది.సికింద్రాబాద్లో చాలా ప్రాంతాల్లో రోడ్లపైనే గోవులు తిరుగుతూ ఉంటాయి.కొన్ని సాయంత్రానికి గోశాలకు వెళ్లిపోతే.. మరికొన్ని ఆయా కూడళ్లలోనే ఉండిపోతాయి..



ఇప్పుడు రోడ్లపై ఉన్న గోవులను ఆ యువకులు టార్గెట్ చేసినట్టుగా తెలుస్తుంది. ఈ మధ్య కాలంలో వరుసగా ఆవులు మాయం అవుతుండడంతో ఎటు వెళ్లిపోయయని భావించిన స్థానికులు.ఇప్పుడు సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యాలు చూసి షాక్ అయ్యారు. వెంటనే ఆ యువకులపై చర్యలు తీసుకోవలంటూ మోండా మార్కెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఆవులకు మత్తు ఇంజక్షన్లు ఇచ్చి కారు వెనకాల భాగంలో వాటిని బలవంతంగా ఎక్కిస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధితో పాటు మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇదే రీతిలో ఆవులను ఎత్తుకెళ్లిన దృశ్యాలు చూసి పోలీసులు నిర్ఘాంతపోయారు. అయితే ఈ ముఠా ఎవరన్నదానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.స్థానికంగా ఉండే గోశాల వద్దకు వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయాల్లో ఆవులకు మత్తు ఇంజక్షన్లు ఇస్తున్నారని, బ్లాక్ కలర్ ఇన్నోవా కారులో వచ్చిన యువకులు ఈ అపహరణకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఇనోవా నెంబర్ ఆధారంగా ఈ ముఠాను గుర్తించే పనిలో ఉన్నారు పోలీసులు. తాజాగా ఈ ముఠా ఎవరు అనే దానిపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సికింద్రాబాద్‌లోనే రెండు రోజుల పాటు ఈ ఘటనలు జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ ముఠా కారు నెంబర్ ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో ఉన్నారు పోలీసులు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

